# అభిమానవతి పద్మ

(కథానిక)

అప్పుడే ఆఫీసునుండి వచ్చి భార్య పద్మను పిలిచాడు ప్రసాదరావు. సమాధానం రాలేదు. ఇల్లుకూడా ఏసందడీ లేక చిన్నబోయినట్టుంది. ఒక్క పిలుపుకే సమాధానం రాకపోవటాని కలవాటుపడ్డ ప్రసాదరావు తిరిగీ పిలిచాడు. ఆ కేకలకు దొడ్లో బాదంకాయలు కొట్టుకుంటున్న పనిపిల్ల సీత పరుగెత్తుకుని వచ్చింది.

"అమ్మగారేరీ?"

"పండుకుని నిద్రపోతున్నారు."

"నిద్రపోతున్నారా?" ఆశ్చర్యపడ్డాడతను. గంట చూచుకున్నాడు. అయిదున్నర అయింది. కోటువిప్పి ఒంకెకు తగిలించి పడక గదిలోకి వెళ్ళాడు. పద్మ గాఢంగా నిద్రబోతూంది. నిద్రలో ప్రశాంతంగా వున్న పద్మ ముఖం చూచేసరికి అతనికేదో తెలియని ప్రేమ, వాత్సల్యం కలిగాయి. మెల్లిగా వెళ్లి మంచం మీద ఆమెప్రక్కన కూర్చుని, ముంగురులు సవరించాడు. దాంతో పద్మకు మెళుకువ వచ్చింది. కళ్లు విప్పి మొగుడివంక చూచింది.

"ఏంపద్మా. ఇంకా నిద్రబోతున్నావేం ఇవాళ?" ఎంతో ప్రేమగా అడిగాడు.

"ఇకనేం! లేపారుగా. తృప్తి కలిగిందిగా మీకు!" కోపంగా అంది పద్మ. ఈ సమాధానానికి చిన్నబుచ్చుకున్నాడు ప్రసాదరావు.

"లేపినందుకు కోపం వచ్చిందా?"

"కోపంలేదు, తాపంలేదు. ఈ మోటు సరసం ఇవాళ మనకు క్రొత్త గనకనా?"

"అంత కోపగించుకోకు. ఇంకెప్పుడూ లేపనులే."

పద్మ మంచందిగి లోపలికి వెళ్ళేందుకు రెండడుగులు వేసింది.

"ఇదుగో..."

"ఏం? నిద్ర లేచిన తరువాత కాస్తముఖమన్నా కడుక్కోనిస్తారా లేదా" పట్టుకున్న చేతి నొక్క విదిలింపు విదిలించి లోపలికి వెళ్లిపోయింది పద్మ. ప్రసాదరావలాగే ఆమంచంమీద వాలాడు. ఇలాంటి సన్నివేశాల లోనే యిప్పటికి మూడు సంవత్సరాల నుండి కాపరం చేస్తున్నాడు పద్మతో. క్రొత్తలో సిగ్గనుకున్నాడు. తరువాత చిన్నతనం అనుకున్నాడు. కాని, ఇంకెన్నాళ్లు? నిరాశతో ఒక్క నిట్టూర్పు విడిచాడు. ప్రేమ, లాలన, వాత్సల్యం, మార్దవం, యిలాంటివేమీ లేకుండా, జీవితం మరలా ఎన్నాళ్లు తిరుగుతుంది? ఏమైనాసరే. ఆరోజు ఆమెతో యీ విషయం మాట్లాడాలని నిశ్చయించుకున్నాడు. మూడు సంవత్సరాలీ విధంగా తాను జీవితం గడిపాడంటే సామాన్యమైన విషయం కాదు. తన హృదయం ప్రేమపూరితమైన ఒక మాట కోసం, ఒక చూపుకోసం అల్లాడిపోతున్నది. తనలోని ఓర్పంతా ఖర్చయిపోయిం దనిపించిం దతనికి.

ఆ సాయంత్ర మిద్దరూ పలకరించుకోలేదు. వంటలక్క ఖంగారుపడుతూనే వడ్డించిం దిద్దరికీ. భోజనంచేసి డాబామీదికి వెళ్లాడు. పద్మ తాంబూలమన్నా తేకపోతుందా అని ఆశపడ్డాడు. గంటయినా యెవరి జాడా లేదు. నెమ్మదిగా గదిలోకి వెళ్ళాడు. పద్మగోడవైపు తిరిగి పడుకుంది. తనుకూడా వెళ్ళి మంచం మీద కూచుని "పద్మా"అని పిలిచాడు.

"..........."

"ఇటుచూడు పద్మా. నీకంతకోపం దేనికి? మనిద్దరి సౌఖ్యం, ఆనందం నీమీద ఆధారపడి వున్నాయి."

"..........."

"నీకేం తక్కువ చేశాను పద్మా. నీవడిగిన వ్యవధానంకూడా లేకుండా నీ కోరికల్ని తీర్చి, నిన్నానందపరిచేందుకు ప్రయత్నిస్తూవుంటానే!

పి. శారదా నాథ్

అన్నిటికీమించి నిన్ను నాహృదయాధి దేవతగా పూజిస్తున్నానే! ఇక నీకు నామీద కోపం దేనికి పద్మా?"

"ఎవరన్నారు కోపమని?"

"నేనంటున్నాను. ఈనాడు మనసు విప్పి అడుగుతున్నాను. నేనంటే నీకంత నిర్లక్ష్యం దేనికి? ఒక్కనాడైనా నవ్వుతూ మాట్లాడవు. ఎంతో అలిసి నీకోసం వురుకుతూవచ్చే నాకు నవ్వుతూ ఒక్కసారైనా ఎదురు వచ్చావా పద్మా? తీయని నీమాటలతో ఒక్కరోజైనా నా అలసట తీర్చేందుకు ప్రయత్నించావా? నాదగ్గర కూర్చుని ఆదరంగా ఒక్కదినమైనా అన్నం పెట్టించావా? పైగా చీదరించుకుంటావు. చెప్పు పద్మా. నీకు నామీదింత నిర్లక్ష్యం దేనికి?"

పద్మ మొగుణ్ణి ఎగాదిగా చూస్తూ కొంచెం కోపంగా,

"అయితే మీ ఉద్దేశ్యం, మీ దాసీకి మల్లే మీకు గడగడలాడుతూ, మీ అడుగులకు మడుగులొత్తుతూ వుండటం లేదనా?"

ఈ సమాధానం విని ప్రసాదు నిర్ఘాంత పోయాడు.

"అవి దాసీది చేసే పనులా పద్మా?"

"మరేమిటి? మీరు వచ్చేసరికి సిద్ధంగా ఎదురుపడి నవ్వుతూ లోపలికి తీసికొని వెళ్ళి, మీ బూట్లు విప్పి, మీకు స్నానం చేయించి, పక్కన కూచుని భోజనం పెట్టి, పక్క లో కూచుని ఖబుర్లు చెప్పి .. ఏమంటారుదీనిని?"

ప్రసాదరావుకు చాలకోపం వచ్చింది.

"ఊహు! దాసీతనమంటారన్న మాట! తెలియలా నాకు. సిగ్గని కొన్నాళ్లు, చిన్నతనంచేత ననుకొని కొన్నాళ్లు అనుకుంటూ వచ్చాను. అంతేకాని, నీలో యిలాంటి మూర్ఖము, దానికి మించిన అహంభావము దాక్కొని వున్నాయని తెలియలేదు నాకు. ఇంకేం? దాసీది చేసే పనులయితే నాకు దాసీలకు తక్కువా? ఇక నీ వెందుకిక్కడ? నిన్ను చూస్తున్న కొద్దీ కడుపు రగిలి పోవటానికా? రాణీవాసం అనుభవిద్దు గాని వెళ్లు మీ వాళ్లింటికి"

పద్మ చివ్వున మంచంమీదినుంచి లేచింది. ఆమె కళ్లు ఎర్రగా జేవురించాయి.

"ఏమిటీ? ఏం, నన్ను కనిపెంచినవాళ్లకు నేను బరువనుకున్నారా? తప్పక రాణీవాసమే అనుభవిస్తాను. మీ నోటి నుండి ఆ మాట వచ్చాక యిక్కడ పడి వుండేందుకు పద్మ గతి లేనిది కాదు, అభిమానం లేనిది కాదు."

* * *

పద్మ వెళ్ళిపోయి రెండు సంవత్సరాలయింది. ఆమెవిషయ మతనికేమీ తెలియదు. ఆ ఊరి నుండి మార్పించుకుని ఒంగోలుకు వచ్చేశాడు. ఒంటరిజీవిత మెంతో కష్టమనిపిస్తున్నా పద్మ నిరాదరణకన్న మేలనిపిస్తోం దతనికి.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చి గదిలో సిగరెట్టు కాలుస్తూ కూచున్నాడు. ఎవరివో పెద్ద కేకలువిని కిటికీలోనుండి తొంగిచూచాడు. తమ ఇంటికి రెండిళ్ళవతల యెందుకో జనం మూగివున్నారు. ఏమిటో చూద్దామనిఅతనుకూడ వెళ్ళాడు. ఒక ఇరవై సంవత్సరాల అమ్మాయి తల వంచుకుని నిలబడివుంది. ఆమె పక్కగా, తలంతా నెరిసిపోయి కళ్లుకూడ కనబడని ఒక ముసలాయన నేలమీద కూచునివున్నాడు. వాళ్ళిద్దరిముందూ నిలబడి ఒక పెద్దమనిషి అరుస్తున్నాడు. ఎందుకలా అరుస్తున్నాడో తెలియక పోయినా, ఆ దృశ్యం చూడగానే, ప్రసాద్ మనసు కలిచినట్లయింది.

"ఇదిగో, నీవు న్యాయంలేకుండా మాట్లాడినా, ఇక్కడి పెద్దమనుష్యులకు న్యాయం తెలియకపోలేదు. అసలుకు నీళ్లు ఒదిలినా, ఒచ్చినంతవరకైనా తీసికొని వెళ్ళవద్దనేందుకు నీకు నోరెలా వస్తోంది?"

"నే నలా అనలేదు. నాకున్నవన్నీ తీసికోండి. ఆ ముసలి ప్రాణాన్ని చూస్తూనే వున్నారు కదా. ఆయనను దయతలచి ఆ ఒక్కమంచం వుంచమని అడుగుతున్నాను. పోతే యిక నా పుస్తకాలు. అవి లేకపోతే యిక నేను చేయబోయే దేముంది. వాటిని తిరిగి కొనేందుకు నాకెంత శక్తి వున్నదో మీకు తెలియనిది కాదు కదా!"

"ఈ కబుర్లన్నీ కట్టిపెట్టు. ఆ పుస్తకాలమ్మినా కనీసం 15 రూ. వస్తాయి. ఆ మంచానికెంతలేదన్నా 3, 4 రూ. వస్తాయి. 20 రూ. వదిలేయమంటావా?

"అయ్యో, నేను మిమ్మల్ని మోసం చేయా

లని అనటంలేదు. దయ తలచమని అడుగుతున్నాను."

ప్రసాదరావు కర్థమైపోయింది. ఆ పెద్ద మనిషి ఇంటి యజమానసీ, బాడుగకోసమా పిల్ల నలా నడివీథిలో నిలవేశాడనీ అర్థం చేసుకుని, గబగబా ఆ పెద్దమనిషి దగ్గరకు వెళ్లాడు.

"చూడండి. ఆ మంచము, పుస్తకాలు అమ్మితే 20 రూ. వస్తాయని కదా అనుకుంటున్నారు! ఆ 20 రూ. నేనిస్తాను. వాటిని నా కమ్మేయండి. ఇక మీరు తీసుకోదలుచుకున్న వన్నీ తీసికొని ఆమెను వదిలేస్తే మంచిది. ఆమె లాటి వాళ్ళను ఇళ్ళలో దాచుకుని కాపాడుకునే మనకు ఈ నడివీథిలో యీమె నింతకన్నా యెక్కువసేపు నిలవేయటం మర్యాద కాదు."

హేమ తెల్లబోయి చూస్తూ నిలబడిపోయింది. ఆమె తెప్పరిల్లి కలియ జూచేసరికి తనూ తన తండ్రి, తమ కెదురుగ ఎవరో ఆ క్రొత్త పెద్ద మనిషీ మాత్రం వున్నారు. ఆమెకు కళ్ళనీళ్లు తిరిగాయి.

"దుఃఖించకండి, ఇవాళ జరిగిన సంఘటనకు సిగ్గుపడవలిసిందా యింటి యజమాని. మీరు కాదు."

హేమ కళ్లు తుడుచుకుంటూ,

"నాకు ఏమనాలో తోచటం లేదు" అంది.

ప్రసాదు నవ్వాడు.

"ఏమీ అనవద్దు. మాట్లాడకుండా మా ఇంటికి వచ్చేయండి. మా ఇల్లు నాకు చాలా పెద్దదై అవస్థగా వుంటోంది. ఒక ప్రక్క తండ్రిగారితో మీరు వాడుకోవచ్చును."

మాట్లాడకుండా నిలుచున్న హేమ సమాధానం కోసం ఎదురుచూడక ఆమె తండ్రి దగ్గరకు వెళ్ళి చేయి పట్టుకుని నెమ్మదిగా లేవదీశాడు. ఆ వృద్ధుడి కళ్ళనుండి నీరు కారుతూండటం గమనించి ప్రసాద్ హృదయం నొక్కినట్లయింది. "పెద్దలు అన్నీ తెలిసిన మీరుకూడా దుఃఖపడటం బాగుండలేదు" అన్నాడు నెమ్మదిగా.

"బాబూ ఈ వయసులో, యిలాంటి రాత నా ముఖాన రాసివున్నందుకు దుఃఖపడటం లేదు. ఇలాంటి కష్ట సమయంలో దేవుడల్లే అడ్డు పడ్డ నిన్ను చూచే భాగ్యంకూడా లేదు" కళ్లు తుడుచుకుని నెమ్మదిగా మళ్ళీ అన్నాడు.

"నా అవమానాని కేమి నాయనా. కాని, నాతల్లి... నా కడుపున బుట్టినందుకు యీనాటి వరకూ దుఃఖంతప్ప సుఖమెరుగని నా హేమను ఇంతమాత్రం ఆదరించినవారు కూడా యింత వరకు లేరు."

ఆ రాత్రే హేమకు నాలుగు చీరలు, ఆమె తండ్రికి రెండు జతల పంచలు తెచ్చియిచ్చాడు. కావలసిన సామాగ్రిని సమకూర్చి ఒక వేపంతా వాడుకోటానికి వాళ్ళకు కేటాయింపుగా యేర్పాటు చేశాడు. హేమ యింత దయను తట్టుకోలేక పోయింది. ఆమెకు తెలియకుండానే అతనిమీద భక్తిభావ మేర్పడింది.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చి ఇంటిని చూచి ఆశ్చర్యపోయాడు. ఇల్లంతా అతి శుభ్రంగా వుంది. ఎక్కడివక్కడ సర్దివున్నాయి. హాలులో బల్లమీద గుడ్డపరచి రెండు కుర్చీలు వేసివున్నాయి. బహుశా నిర్లక్ష్యంగా ఆ మూల కొట్లో తాను పడేసినవి హాలులోకి వొచ్చి వుంటాయి. బల్లమీద ఒక గాజు పళ్లెం మూత పెట్టివుంది. పక్కనే ఒక గాజు గ్లాసులో నీళ్లు వున్నాయి. నెమ్మదిగా వెళ్ళి ఆ పళ్లెంమీది మూత తీసి చూచాడు. రెండు రవ్వ దోసెలు, పక్కనే అలుగడ్డ కూర. ప్రసాదరావు నొచ్చుకున్నాడు.

"అయ్యో, యింకా తిన లేదా? తిన్నా రనుకుని కాఫీ తెచ్చానే!"

ప్రసాద్ వెనక్కు తిరిగి చూశాడు.

"ఎందుకొచ్చిన శ్రమ హేమా?"

"శ్రమేమిటి? పాపం మీరొంటరిగా వుంటున్నట్లున్నారు. వెధవ హోటళ్లు ఏం రుచిగా వుంటాయి? మీకు అభ్యంతరం లేకపోతే మీరు హోటలు భోజనం మానేయండి. నాకు వంట చేతనవును."

"బాగుంది. నీవు వంట చేయుట మేమిటి?"

"అనవసర ప్రస్తావనచేస్తున్నాననీ, అధికంగా జోక్యం కలుగజేసుకుంటున్నాననీ అనుకుంటున్నారా?"

ప్రసాద్ తడబడ్డాడు.

"ఛా. అలా యెందుకనుకుంటాను. నీవు మల్లే యింత ఆదరంగా నాతో మాట్లాడిన

వాళ్ళేలేరు. నా దురదృష్టంవల్ల మా అమ్మ కూడా నా చిన్నతనంలోనే చనిపోయింది."

అతను చాలా ఒంటరిగా వుండి వుండాలను కుని హేమ జాలిపడ్డది.

"నీ ఆదరమే నాకు చాలు. ఇక్కడ నాకు ఉపచారాలు చేస్తూకూచుంటే. నీ చదువేం చేస్తావు?"

"ఇంకా యేంచదువు. మానేస్తాను."

"మానేస్తావా? అదేమిటి?"

"ఏంపెట్టి చదవాలి? ఈ వయసులో మా నాన్నకిక నాగురించి ఆందోళన కలిగించను. ఇప్పటికే బుద్ధి గడ్డితిన్నది. ఇంకానా?

"నీ కభ్యంతరం లేకపోతే నీచదువుకు నేను సహాయం చేస్తాను హేమా. దానికోసం నీవేమీ దిగులుపడవద్దు."

హేమ నిట్టూర్పు విడిచింది.

"మీకంతటి ఉదారత వుందని నాకు తెలుసు. కాని, క్షమించండి. ఇక నేను చదువు చాలించటమే అన్నివిధాలా మంచిది. ఇంకా ఎఫ్. ఏ. మొదటి సంవత్సరమే కదా. ఇది పూర్తిచేసేసరికి రెండు సంవత్సరాలు తీసు కుంటుంది. ఇంతా చేస్తే దానివల్ల అధికంగా వచ్చే దేమీ లేదు. ఏదైనా పని చూసుకుంటే మా నాన్న బ్రతికున్నంతకాలం జీవితం కాస్త శాంతంగానన్నా గడుస్తుంది."

"..............."

"మీరు కాఫీ త్రాగండి. చల్లారిపోతుంది."

అతను మాట్లాడకుండా కాఫీ త్రాగాడు.

ఆరాత్రి వంకాయ కూర, కంగిపచ్చడి, చారుతో, భోజనం పెట్టింది హేమ.

* * *

"ఇవాళ అప్పుడే వచ్చారే."

నవ్వుతూ అతని కెదురు వెళ్ళి, అతని చేతి లోని సంచినందుకుంది హేమ.

"ఇవాళ పని తొందరగా అయింది."

"రండి. పాపం అలిసివచ్చారు. వసారాలో సబ్బు, నీళ్లు పెట్టాను. ముఖం కడుక్కొని రండి."

ప్రసాదు ముఖం కడుక్కొని, తువ్వాలు కోసం గదిలోకి వెళ్ళాలని వెనక్కు తిరిగాడు.

"ఇదుగో" నవ్వుతూ అందిచ్చింది హేమ.

అది అందుకొని తుడుచుకుంటూ లోపలికి వెళ్ళాడు. బల్లమీద కాఫీ ఫలహారం సిద్ధంగా వున్నాయి.

"అదేమిటి! నాకొక్కడికే పెట్టావేం? నీవు కూడా తినకూడదూ?

"నేనిందాకనే తిన్నాను. ఇద్దరం తినే దానికన్నా, మీరు అలిసివచ్చి, తింటూంటే, నేను కులాసాగా కబుర్లు చెబుతూ కూచుంటే, విశ్రాంతిగా తింటారని అలా నేను ముందే తినేశాను."

ఈ మాటలు వినేసరికి ప్రసాద్‌కు తన జీవితమంతా గుర్తుకు వచ్చింది. ఏదో చెప్పలేని బాధ కలిగింది. ఇలా ప్రేమగా తన పద్మ మాట్లాడాలని ఎంతగా వుండేది తనకు! చల్లని ఒక్కమాటకోసమెంత తపించాడు! హేమ తన జీవితంలో ప్రవేశించిన యీ పదిరోజుల లోనే తన మనసామెవేపు పరుగెత్తటం అతను తెలుసుకోకపోలేదు. ఆమె సౌందర్యమే కారణమా అంటే, కాదు. పద్మ హేమకన్నా చాల అందమైనది. నిజానికి పద్మను తాను మనసిచ్చి ప్రేమించాడు. కాని, హేమ చూపే లాలన, మార్దవం, చివరకు స్త్రీత్వం కూడా ఆమె అహంకారంలో అణగిపోయినాయి. ఆ అహం కారమే ఆమెను తననుండి దూరం చేసింది. ఆమెలో లేవని తాను తపించిన ఆ ప్రేమ వాత్సల్యాలే, యీనాడు తనను హేమవేపుకు లాగుతున్నాయి.

"ఏమిటాలోచిస్తున్నారు? తినండి. చల్లారి పోతున్నాయి."

"అన్నింటికీ నీ వెందుకాయాసపడుతావు? ఆ నౌకరు వెధవున్నాడుగా వాడు చేస్తాడులే హేమా"

"బజారు పనులంటే చేస్తాడుగాని, మనకు సంబంధించిన వాటిలో వాడికి మనకున్న శ్రద్ధెం దుకుంటుంది?"

"నీకుమాత్రమంత శ్రద్ధ దేనికి హేమా?"

ఇలాంటి ప్రశ్న వస్తుందనుకోలేదు. అందువల్ల తడబడింది.

"చెప్పు హేమా. నేనంటే నీకింత దయ దేనికి?"

"మీరు నామీద చూపుతున్న దయకన్నా యెక్కువ చూపుతున్నానా?"

తల వంచుకునే జవాబిచ్చింది. ప్రసాద్ నెమ్మదిగా లేచి, ఆమె దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ పట్టుకుని,

"నా అదృష్టంవల్ల నీతో నాకు పరిచయం కలిగింది. ప్రేమంటే యేమిటో ఆదరమంటే యేమిటో తెలియక, వాటికోసమెంత ఆరాట పడ్డానో నీకు తెలియదు. నన్ను, నాకు సంబంధించిన వాటినీ లక్ష్యపెట్టి, నాకోసం ప్రేమతో చేసేవాళ్లు లేక ఎంత తపించాను! జీవితంలో ఏదిలేక శాంతిని పోగొట్టుకున్నానో, దానినీ విధంగా పొందగలుగుతానని ఎప్పుడూ అనుకోలేదు. కాని... ఈ అదృష్టాన్నీ, సుఖాన్నీ, తృప్తినీ నాకు శాశ్వతంగా యివ్వగలవా హేమా?"

హేమ మాట్లాడలేదు. కాని అతని చేతులలో తన ముఖం వుంచుకుని వెక్కి వెక్కి యేడ్చింది. ప్రసాదామెను దగ్గరకు తీసుకుని,

"ఏడుస్తావెందుకు హేమా. ఆదరంగా మాట్లాడేవాళ్లు లేక నీవు తపించావు. నేనూ ఏదో తెలియని బాధలో కొట్టుకున్నాను. భగవంతుడు మనిద్దరిలోటు యీవిధంగా తీర్చాడు. ఆ ఇంటి యజమానికి యీ కారణంగా నిన్ను నాకు ప్రసాదించినందుకు నిజంగా నా మనస్సులో నమస్కరిస్తున్నాను హేమా."

* * *

హేమతండ్రి చనిపోయి నెలరోజులయింది. హేమకు బుద్ధి తెలిసినప్పటినుండి తల్లి, దండ్రి, అంతా ఆ తండ్రే. అందువల్లే ఆయనమరణంవల్ల కలిగిన గాయం త్వరగా మానలేదు.

ప్రసాదు ఆఫీసు పనిమీద ఏదో వూరు వెళ్లాడు. హేమకు మరీ తోచక ఏవైనా పుస్తకాలు దొరుకుతాయేమోనని అతని పుస్తకాల షల్ఫు అంతా వెతికింది. దానిలోవన్నీ అతని కాలేజీ పుస్తకాలు, ఆఫీసు కాగితాలే తప్ప, ఆమెకు కావలసిన కథల పుస్తకాలు దొరకలేదు. కాని ఒక పుస్తకంలోనించి ఏదో ఫోటో జారి క్రిందపడింది. హేమ వంగి దాన్ని తీసికొని చూచింది. అలాగే కొయ్యబారి పోయింది. తన కళ్ళని తనే నమ్మలేక మళ్ళీ చూచింది. అదే ఫోటో, తనేమీ పొరపాటు పడలేదు. అది ప్రసాదు పెళ్ళి ఫోటో.

వెంటనే ఒక ఆలోచన తట్టి ఆమె కొస్త కుదుటబడ్డది. పాప మామె చనిపోయి వుండవచ్చును. కాని, ప్రసాదు తనతో యీ విషయమే చెప్పలేదే! బహుశః అతనికి చెప్పేందుకు కష్టంవేసి చెప్పి వుండకపోవచ్చు.

ఎందుకో ఆమెకు తెలియకుండానే అతని పెట్టెదగ్గరకు వెళ్ళి దానిని తెరిచింది. ప్రసాదుకు తన పెట్టెలకు తాళంవేసుకునే అలవాటు లేదు. అయినా, ఇంతకుపూర్వం దానిని తెరవవలిసిన అవసరం కలగలేదు హేమకు. గబగబా బట్టలన్నీ పైకితీసి అడుగున వున్నవన్నీ పరీక్షచేసింది. చివరకు ఆమెకు కావలసింది దొరికింది. అది చక్కని ఫ్రేములో బిగించివున్న పద్మ ఫోటో. చాల చక్కని ముఖం అనుకుంది హేమ. దానిని పైకి తీసి, చక్కగా తుడిచి తమ గదిలో గోడకు తగిలించింది.

ఆ సాయంత్రం ప్రసాదు వూరినుండి వచ్చాడు. అతను గదిలో అడుగుపెడుతూనే, ఆ ఫోటోని చూచి నిశ్చేష్టుడైపోయినాడు. అది గమనించిన హేమ తడబడుతూ,

"మీ మనసుకు కష్టం కలిగించానా?" అంది. అతను మాట్లాడకుండ హాలులోకి వెళ్ళిపోయినాడు. పద్మ విషయం హేమతో చెప్పకుండా మోసంచేయాలని ఏనాడూ అనుకోలేదు. కాని, చెప్పే అవకాశం కలగలేదు. నిజానికి తమ పెళ్ళికి పూర్వమే చెప్పి వుండవలసింది. కాని, చెప్పకుండానే జరిగిపోయింది. ఎందుకు చెప్పలేదో అతనికే తెలియలేదు. చెప్పకపోవటం ప్రయత్నపూర్వకంగా కాదని మాత్రం తెలుసు.

హేమ కొస్త ఖంగారుపడ్డది. ఆ ఫోటో అతని నింత కలవరపెడుతుం దనుకోలేదు. నెమ్మదిగా తనుకూడ హాలులోకి వచ్చి అతని కుర్చీప్రక్కనే నుంచుని "మిమ్మల్ని కష్టపెట్టాను కదూ?" అంది. తలెత్తి ఒక్కసారి హేమవైపు చూచి, మళ్ళీ తల వంచుకున్నాడు. అతని ఆ వేదనంతా ఆ కళ్ళలోనే విస్పష్టంగా కనబడుతోంది.

"క్షమించండి. చనిపోగానే మరిచిపోవటమేనా అని కొద్దిగా కష్టంవేసి మళ్ళీ ఒకసారి మీకామెను జ్ఞాపకం చేద్దామని గోడకు తగి

లించాను. మీకింత బాధ కలుగుతుందని తెలియలేదు" ప్రసాదు ఇక తట్టుకోలేకపోయాడు. చప్పున హేమ రెండుచేతులూ పట్టుకుని ఆమె వంక దీనంగా చూస్తూ, వుద్రేకంగా "నన్ను క్షమిస్తావా హేమా?" అన్నాడు. హేమ కర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా అతని కళ్ళలోకి చూచింది.

"పద్మ చనిపోలేదు హేమా, బ్రతికేవుంది" నెమ్మదిగా అన్నాడు తలవంచుకుని. యీ మాటలు హేమకు చాల ఘాటుగా తగిలాయి. ఆమె ముఖం పాలిపోయింది. ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"అయితే మరి ... ఆమె ఏదీ?" అంది.

"అదే హేమా. ఆమె యిక్కడెందుకు లేదో చెబితే బహుశా నీవు నన్ను క్షమిస్తావనుకుంటాను."

హేమకు నోటమాట రాలేదు. అలాగే చూస్తూకూర్చుంది. ప్రసాదు ఒక కుర్చీని తన దగ్గరగా లాగి,

"ఇలా నా కెదురుగా కూర్చో హేమా. నీ కంతా చెబుతాను" అన్నాడు.

హేమ నిశ్శబ్దంగా వెళ్ళి కుర్చీలో కూచుంది. ప్రసాదు తల వంచుకుని జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

"అసలు విషయం యిది. అంత చిన్నమాట మీద ఆమె నిజంగానే వెళ్ళిపోయింది. పోనీ వెళ్లిన తరువాత నయినా నావిషయమింతవరకు కనుక్కొనేందుకన్నా ప్రయత్నించలేదు. ఒక ఉత్తరమన్నా ... ..."

హేమ మధ్యలో అతనినాపి,

"ఆమె సంగతలా ఉంచండి. పోనీ మీరెప్పుడైనా ఆమె విషయం కనుక్కొనేందుకు ప్రయత్నం చేశారా? ఆమెకొక ఉత్తరం వ్రాసి చూచారా?"

"లేదు."

"మరి? అలాయితే ఆమెను తప్పుపెట్టేందుకు మీకేమధికారముంది? మీ రెంతో ఆమె అంత. ఆమె ఎంతో మీరంత. ఇద్దరికీ సరిపోయింది."

"... ... ... ... ..."

"సంసారమన్న తరువాత ఎవరికైనా భేదాలు వుంటాయి. వాటిలో హెచ్చుతగ్గులుంటే వుండవచ్చు. అంతమాత్రమే. అలాంటప్పుడు సర్దుకుపోవాలి. చేతనయితే ఒకరికి తెలియనివి మరొకరు నేర్చుకోవాలి. మీరు మూడేళ్లు ఓపికపట్టానంటారు. ఏవిధంగా ఓర్చుకున్నారో మీరాలోచించలేదు. ఏవిధమైన ప్రయత్నం లేకుండా ఆమెలో మార్పు వస్తుందేమోననిచూచారేగాని ఆ మూడుసంవత్సరాలు మీ చాతుర్యం వుపయోగించి, ఆమెను నెమ్మది మీద మార్చటానికి ప్రయత్నిస్తూ, ఆమెలో జీవం పోయటానికి కృషిచేసివుంటే, ఆ మీ ఓర్పుకు ఫలితం యిలా మీ సంసార విచ్ఛేదన కాక, ఈపాటికి మీరిద్దరూ ఎంతో సుఖంగా వుండివుండేవారు. మీ పద్ధతి నాకేమీ నచ్చలేదు. అంతా పూర్తయిన తరువాత తెలిసింది. ఆమెకుండవలసిన యీ అధికారాన్ని, ఆమె పొందవలసిన యీ సుఖాన్ని, ఆమె జీవించి వుండగానే, నా కనుభవించటం చేతకాదు."

"నన్నేం చేయమంటావు?" ఎంతో జాలిగా అడిగాడు.

"మీ మనసును నొప్పించానా? మరి పాపం ఆ అమాయకురాలు ఎంతగా నొచ్చుకుంటూ వుండి వుండాలి? ఆడదాని హృదయం, ఆడదాన్ని కనుక నాకు తెలుస్తుంది. మీకేం తెలుస్తుంది?"

ప్రసాదు మాట్లాడకుండా ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు.

"నేను చెప్పినట్లు వింటారా?" చాలా ప్రేమగా అడిగింది. ఏమిటన్నట్లు చూచాడు ప్రసాదు.

"రేపు మీరు వెళ్ళి పద్మను తీసుకునిరండి." ప్రసాదు అదిరి పడ్డాడు.

"ఏ ... ఏమంటున్నావు?"

"పద్మను తీసుకొనిరండి."

"అది నావల్ల కాదు హేమా. ఇన్నాళ్ళకు నాకుగా నేను వాళ్లింటికి ఎలా వెళ్ళగలనో నీవే చెప్పు."

హేమ నవ్వింది.

"మీ భార్య దగ్గరకు మీరువెళ్లటానికి ఒకరి అంగీకారము, ఆహ్వానము కావాలా? ఇదే అభిమానం ఆవిడనుకూడ అడ్డగించి వుంటుంది. అర్థంలేని యీ అభిమానాలలోని నాగరికత

ఏమిటో? భార్య దగ్గర భర్తకు, భర్త దగ్గర భార్యకూనా అభిమానం! ఏదో తాత్కాలికంగా మనసుకు బాధ కలిగినా, ప్రేమ వున్నచోట అభిమానానికవకాశమెక్కడుందో నా కర్థంకాదు. మాట పట్టింపులతో ప్రేమ కక్షగా యెలా మారిపోతుందో తెలియదు. భార్య, భర్త అన్న తరువాత యెప్పటి కోపాలప్పుడే మరిచిపోవాలిగాని యీ పంతాలేమిటి?

"...............”

"వెళ్లరన్న మాట?"

"నన్ను శిక్షించేందుకు వేరేమార్గం లేదా హేమానీకు?"

"శిక్షా? ఇది శిక్షన్నమాట! భేష్. సరే, యీ పంతాలు, కక్షలు, అభిమానాలు, యెలాగుంటాయో నేనూ రుచి చూస్తాను. రాత్రే నాదోవ నేను చూసుకుంటాను" గంభీరంగానే అంది హేమ. అసలే వ్యాకులంతో మనసు చెదిరి వున్న ప్రసాదు మీద మంత్రం బాగా పని చేసింది. అతనొక్కసారిగా అదిరిపడి హేమను దగ్గిరకు తీసుకుంటూ,

"ఆ పనిమాత్రం చేయకు హేమా. జీవితంలోని వెలుగును చూడటం నేర్చుకుంటున్న నన్ను మొదట్లోనే అంధకారంలోకి తోసెయ్యకు."

హేమకు జాలివేసింది. అతని మాటలు వింటూంటే దుఃఖంకూడ వచ్చింది. కాని తను కఠినంగా వుండకతప్పదు.

"మీరనవసరంగా ఖంగారు పడుతున్నారు" అంది నెమ్మదిగా.

"సరే నీమాటప్రకారం వెడతానే అనుకో. ఒకవేళ నేను వెళ్ళినా ఆమె రాకపోతే ఏం చేయమంటావు?" చిన్నపిల్లాడికిమల్లే వేసిన ఆప్రశ్నకు హేమకు నవ్వు వచ్చింది.

"మీకా భయమవసరం లేదు. రెండు సంవత్సరాల అనుభవమామెకు చాలును. మీరు వెడితే ఆమె తప్పక వస్తుంది మీతో!" అని ధైర్యం చెప్పింది హేమ.

(వచ్చే సంచికతో ఆఖరు)

స్కెచ్

# కొత్త కోడలు

పి. సత్యనారాయణమూర్తి

కోడలు కాపరానికి వస్తుందనగానే ఇంట్లో కొంత సంచలనం కలిగింది. కలగదు మరీ! కొత్తకోడలూ- అందులో పట్నవాసం కోడలూను. ఆమె వస్తుందనే వార్త భయాన్ని కలిగించకపోయినా ఆఇంట్లోవాళ్ళకి ఆదుర్దానైనా కలిగించిందనే చెప్పాలి. అప్పటిదాకా దేన్ని గురించీ ఆలోచించనివాళ్ళ మెదడులు ఈ వార్తతో తీవ్రంగా పనిచెయ్యడం ప్రారంభించాయి. ఆమె ఎల్లావుంటుంది? ఏమంటుంది? పల్లెటూరు మనుషుల్ని చూసి అసహ్యించుకుంటుందా? ఆక్షేపిస్తుందా? అసలింతకీ సజావుగా కాపరం అంటూ చేస్తుందా? అనే ఆలోచనల్తో అత్తగారు సతమత మవుతూ అస్తమానం భర్తను సాధించే అలవాటుని తాత్కాలికంగా మరిచిపోయింది.

మామగారు నిశ్చింతగా కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటూన్నా కొత్త కోడల్ని గురించి ఆలోచించకుండా ఉండలేక పోతున్నాడు. అతని భయం అల్లా ఒక్కటే! రెండు పూట్లా తిని కూర్చోవడం తప్పితే మరేం చెయ్యటంలేదు అని తనని సోమరిపోతుగా జమకట్టేస్తుందని భయం. అతని పెద్దకొడుక్కి మరదలు వస్తుందంటే మరేం భయంలేదు. కాని తమ్ముడి గదిలో రాత్రింపగళ్లు తృప్తితీరా తను గుర్రుపట్టి నిద్రపోవడానికింక వీలుండదేమో అని భయం. తను చేసే ప్రతిపనిలో వాటాపెట్టిఅత్త